



## మాయ చేస్తూ చోరీ చేస్తున్న మాయలేడి అరెస్ట్



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** బస్సులలో ప్రయాణిస్తూ ప్రయాణికులను మాయ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న మాయలేడిని కావలి వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందితో చాకచక్యంగా పట్టుకున్నారు. ఆమె దగ్గర వున్న పది లక్షల 32 వేల రూపాయలు విలువ చేసే 344 గ్రాముల తూకం కల్గిన రెండు బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి డిఎస్పీ యం.వెంకట రమణ వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా కుప్పం టౌన్ పైబటగుడిపల్లి రోడ్డుకు చెందిన పసుపులేటి రేణుక బస్సులలో తిరుగుతూ ప్రయాణికులను మభ్యపెడుతూ డబ్బులు, బంగారం చోరీ చేసేదన్నారు. పోలీసుల కళ్లుగప్పి ఈ మహిళ చోరీలు చేస్తోందన్నారు. గత నెల 15వ తేది ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం ధవగూడూరు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు బ్యాగులోని రెండు బంగారు బిస్కెట్లు చాకచక్యంగా చోరీ చేసిందన్నారు. కావలి టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల్ని మైమరిపిస్తూ బంగారం దోచుకుంటున్న ఈ మహిళను వలపన్ని పట్టుకోవడం జరిగిందన్నారు. కావలి వన్‌టౌన్ సిఐ టు టౌన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు తన పర్యవేక్షణలో ఈ మహిళను పట్టుకొని బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మహిళను పట్టుకోవడంలో సిఐ శ్రీనివాసరావు, టు టౌన్ ఎస్ఐ జె.మాల్యాద్రి, పోలీస్ సిబ్బంది ఎస్.కె.రియాజ్, రసూల్, వేణు, మనోజాలు కృషి చేశారన్నారు. వారందరిని డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మహిళను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ మాల్యాద్రిలు పాల్గొన్నారు.

## గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మ నూతన బింబస్థాపన

**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణం రైల్వే రోడ్డులోని గీతా మందిరం జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణలో భాగంగా బుధవారం శ్రీకృష్ణ పరమాత్మ నూతన బింబ స్థాపన వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఎంతో వైభవంగా జరిగాయి. భక్తులు, దాతలు పాలరాతి శ్రీకృష్ణ విగ్రహాన్ని దర్శించుకొని తరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష కార్యక్రమాలు జరిగాయి. పుణ్యాహం, అగ్నిప్రణయనం, కలశారాధన, ఉక్తహోమం,నవకలశస్నపన, క్షీరాధివాసం, జలాధివాసం, అధివాస హోమాలు, యాజమాన ఆశీర్వచనం, యంత్ర స్థపన, రత్నన్యాసం, సర్వదేవతార్చన, పుష్పాధివాసం, విశేష హోమాలు జరిగాయి.

## స్టాఫ్ నర్స్ పోస్టులు రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

**నెల్లూరు డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** గత 2020 సంవత్సరం మార్చి నెలలో 103 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆనాడు ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఇప్పుడు విడుదల చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పట్లో కొంతమంది కోర్టుకు వెళ్ళినందువల్ల కోర్టు ఆదేశాలతో పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపి వేశామన్నారు. తరువాత కాలంలో అభ్యర్థులు కేసు వాపసు తీసుకున్న ఫలితంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పడిన మరో 8 పోస్టులు కలిపి మొత్తం 111 స్టాఫ్ నర్సు పోస్టులను కాంట్రాక్టు విధానంలో నియమించేందుకు చర్యలు చేపట్టి రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని పేర్కొన్నారు. అభ్యర్థుల వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీవోవి.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే గురు, శుక్రవారాల్లో సాయంకాలం 5 గంటలలోపు తగు ఆధారాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వివరాలు అందచేయాలని కోరారు.

# తుఫాన్‌తో నష్టపోయిన రైతుల్ని ఆదుకుంటాం





**మనుబోలు, డిసెంబరు 14 ప్రభాతవార్త** మాండౌస్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మనుబోలు మండలంలోని వీరంపల్లి గ్రామంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను అధికారులతో కలిసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఏ ఒక్క రైతు నష్టపోకుండా 80 శాతం సబ్సిడీతో విత్తనాలు, దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఉదారంగా అందించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి కాకాణి తెలిపారు. జిల్లాలో ముందస్తుగా చేపట్టిన చర్యలతో ఎటువంటి ఆస్తి,ప్రాణ నష్టం జరగలేదన్నారు. కొంత మేర మాత్రమే నష్టం వాటిల్లిందన్నారు. రైతులకు అన్ని విధాల అండగా నిలిచే గొప్ప మనసున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వుండటం మన అదృష్టమని ఈ సందర్బంగా మంత్రి కాకాణి తెలిపారు. ముందుగా వ్యవసాయ మండలి అధ్యక్షులు జెట్టి సురేందర్‌రెడ్డి మంత్రిని కండలేరు ప్రవాహంలో దెబ్బతిన్న పంటలను, నారుమళ్లను చూపించారు. అదే సమయంలో జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, మండల వ్యవసాయాధికారులు ఎస్.కె.జకీర్‌ను మాండౌస్ తుఫాన్‌తో మనుబోలు మండలంలో జరిగిన పంట నష్టాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. నారుమళ్ళు 300 ఎకరాలు, వేసిన నాట్లు 4500 ఎకరాలకు నష్టం జరిగినట్లు మంత్రికి చెప్పారు. ఈ నష్టం అంచనాలను నివేదిక ఇస్తే రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని మంత్రి చెప్పారు. మంత్రి వెంట నెల్లూరు ఆర్డీవో మలోల, తహశీల్దార్ సుధీర్, ఎంపిపి గుండాల వజ్రమ్మ, నెడ్‌కాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, వ్యవసాయ మండలి అధ్యక్షులు జెట్టి సురేందర్‌రెడ్డి (వీరంపల్లి), నియోజకవర్గ స్పెషలాఫీసర్ (హార్టికల్చర్) వెంకట సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఎడిఎ శ్రీనివాసరావు, ఎంపిడివో గండవరపు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎస్.కె.జకీర్, వైఎస్సార్‌సిపి నాయకులు ఏడం మల్లికార్జునరెడ్డి, నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆవుల తులసీరామ్ యాదవ్, వైసిపి అధికార ప్రతినిధి దాసరి మహేంద్రవర్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుంజి రమేష్, తదితరులు పాల్గొన్నారు

## సచివాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి



**చేజర్ల,డిసెంబర్14ప్రభాతవార్త:** సచివాలయాలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆదూరుపల్లి, చిత్తలూరు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలను , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు . సచివాలయాన్ని హాజరు పట్టికను , రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న భవన నిర్మాణాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం , రైతుభరోసా , ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయనే విషయంపై సచివాలయ సిబ్బందితో చర్చించారు. సచివాలయ భవన నిర్మాణాలు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తిచేసి నూతన భవనాల్లో కార్యాలయాలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ కు సంబంధించి ఎంతవరకు అభివృద్ధి సాధించారో తెలియజేయాలన్నారు. నుడాలో ఇటీవలే కలవడం వలన రిజిస్ట్రేషన్లు పూర్తిచేశామని, త్వరలో నిర్మాణాలు చేపడతామని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్‌లు ఏమేరకు వచ్చాయో ,అమ్మఒడి తదితర విషయాలపై వెల్ఫేర్ అసిస్టెంట్‌తో చర్చించారు. ఇకెవైసి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సచివాలయంలోని రిజిస్టర్లు , పథకాలు సూచించే బోర్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సక్రమంగా విధులకు హాజరై సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. చిత్తలూరు సచివాలయాన్ని కూడా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పెరుమాళ్ళపాడులో చుక్కల భూములను పరిశీలించారు. రీసర్వే కార్యక్రమాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల పొలాలకు సంబంధించి డాక్యుమెంట్లతో రీసర్వే బృందాలను కలిసి భూములకు సంబంధించిన హక్కులను పొందాలన్నారు. గ్రామాల్లోకి సర్వే బృందాలు వచ్చే రెండురోజులు ముందుగా పొలాలకు సంబంధించిన హద్దుల ధృవపత్రాలను అధికారులకు ఇవ్వాలన్నారు. వివాదాలకు తావులేకుండా గ్రామస్తులు , ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించి రీసర్వే సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. చుక్కల భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నా మన్నారు . ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణకుమారి, చేజర్ల ఇన్‌చార్జ్ తహసిల్దార్ పుట్టాబత్తిన విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మత కుట్రతోనే ప్రహరీ కూల్చివేత



**నెల్లూరు డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** మత కుట్రతోనే అధికార పార్టీ నేతల అండ, ఆదేశాలతో రోడ్లు, భవనాల శాఖ అధికారి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అత్యుత్సాహంతో డిఈ సీతారామాంజనేయ దేవస్థానం ప్రహరీని కూల్చి వేయడం జరిగిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు, గుండ్లపల్లి.భరత్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ నాయకుడు శశికుమార్, ప్రముఖ సినీనటి, రామభక్తురాలు కరాటే.కళ్యాణి విరుచుకుపడ్డారు. బుధవారం మైపాడు గేటు వద్ద ఉన్న సీతారామాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నేతలు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరుతో కొందరు అధికారులు వైసీపీ నాయకులతో లాలూచీపడి భీభత్సాన్ని సృష్టించి ప్రహరీ గోడను తొలగించడమే కాకుండా ఆలయాన్ని కూడా తొలగించాలని కుట్ర చేశారని వారు ఆరోపించారు. తుఫాను భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతూ ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో ఇళ్ళను ఎలా తొలగిస్తారని ఆ ప్రాంత వైసీపీ నాయకులను ఈ సందర్భంగా వారు సూటిగా ప్రశ్నించారు. హిందు దేవాలయాలపై ఎవరైనా దాడులు, విధ్వంసాలకు పాల్పడితే ఉవ్వెత్తున ఎగసిపడుతున్న హిందు సమాజ ఉప్పెనలో కొట్టుకుపోవడం తథ్యమని బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ టీడీపీ నేతలు విరుచుకుపడ్డారు. ఎవరూ లేని సమయంలో జేసీబీలతో ఇలా కూల్చి వేయడం దుర్మార్గమన్నారు. రోడ్లు భవనాల శాఖ డిఈ చేసిన పనులతో ఈ ప్రాంతం ప్రజలు భయభ్రాంతులకు గురైయ్యారన్నారు. రోడ్డు వెడల్పులో వైసీపీ నాయకుల కార్యాలయాలు, దుకాణాలు ఉన్నా వాటిని తొలగించకుండా మిగతా వాటిని మాత్రమే తొలగించడం దారుణమన్నారు. గతంలో ముఖ్యమంత్రులు దేవాలయాలు, దేవుళ్ళతో పెట్టుకుని ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ఇలాంటి పనులు చేస్తున్నవారు గుర్తు చేసుకోవాలన్నారు. దేవాలయాలు, దేవుళ్ళతో పెట్టుకుంటే తప్పనిసరిగా పరిహారం చెల్లించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. హిందూ సంఘాలు భారతీయ జనతా పార్టీ ఉమ్మడిగా పోరాటం చేయగా తెలుగుదేశం పార్టీ కూడా తమ మద్ధతును పూర్తిగా ప్రకటించిందన్నారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎస్పీలకు పూర్తి వివరాలు తెలియచేశామని, దేవస్థానం దేవాదాయశాఖ పరిధిలో ఉందని వారికి తెలిపామన్నారు. కలెక్టర్, కమిషనర్లు సానుకూలంగా స్పందించారని, కమిషనర్ భూమి వివరాలను ఆలయ చరిత్ర తమకు తెలియదని ప్రస్తుతం తెలుసుకున్నామని చెప్పినట్లు వారు వెల్లడించారు. త్వరలోనే ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తామని కమిషనర్ తెలిపారన్నారు. 110 ఏళ్ళ చరిత్ర కలిగిన గుడిని ఉద్ధేశ్యపూర్వకంగానే వైసీపీ నేతలు తొలగించాలని కుట్ర చేశారని, అందులో భాగంగానే ప్రహరీ గోడను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. టీడీపీ మాజీ కార్పొరేటర్ మామిడాల.మధు మాట్లాడుతూ 2019లో రోడ్డు సర్వే నిర్వహించినప్పటికీ ఇక్కడున్న పరిస్థితుల దృష్ట్యా రోడ్డు వెడల్పును గతంలోనే నిలిపి వేయడం జరిగిందని గుర్తుచేశాడు. పేదలకు ప్రత్యామ్నాయం కల్పించకుండా ఇలాంటి దిగజారుడు పనులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందన్నారు. గుడి ప్రహరీ కూల్చిన విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను చూసి రామభక్తురాలు, సీనీనటి కరాటే.కళ్యాణి హైదరాబాదు నుంచి బుధవారం నెల్లూరుకు చేరుకుని విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మత కుట్రలు చేస్తున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో హిందు బంధువులు వైసీపీకి ఓట్లు వేయరన్నారు. హిందూ దేవాలయాలపై చేస్తున్న దమనకాండలపై అధికార పార్టీ తీవ్రస్థాయిలో ఆమె విరుచుకుపడ్డారు. బిజేపీ నాయకులు సత్యనారాయణ, నరసింహులునాయుడు, గిరికుమార్‌గౌడ్, పిడుగు.లోకేష్, పోనమల్లి.రామకృష్ణ, తురక.శ్రీనివాసులు, పి.భాస్కర్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు బి.విశ్వనాథ్, సోమరాజుపల్లి.నాగేంద్రశర్మ, డివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు



**మర్రిపాడు,డిసెంబర్14ప్రభాతవార్త:**మండలంలోని డిసిపల్లి పొగాకు వేలకేంద్ర పరిధిలోని పలు గ్రామాల్లో బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తన సిబ్బందితో తుఫాన్‌కు దెబ్బతిన్న పొగాకు పంటను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన సుమారు 800హెక్టార్లలో పంట పాక్షికంగా , పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు పొలంలో ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు తీసివేయాలన్నారు. అనుకూలమైన తేమ ఉన్నప్పుడు వీలైనంత త్వరగా అంతర్‌సేధ్యం చేయాలన్నారు. పంటలో అదనంగా వారి పొలంకు సరిపోయే అమ్మోనియం సల్ఫేట్‌ను వేయాలన్నారు. మొక్కలను ఎటువంటి తెగుళ్ళు సోకకుండా శిలీంద్రనాసిని ని పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వేరు ద్వారా పోషకాలను తీసుకోలేదు కావున నీటిలో కరిగే 19.19.19,13.0.45లను పిచికారీ చేయాలన్నారు. పొగాకు నారుమడులను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బోర్డు సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## ఆహ్లాదకరకంగా పిల్లల పార్కులో వసతులు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నగరంలోని స్థానిక చిల్డ్రన్స్ పార్కులో పచ్చదనాన్ని పెంచి, ఉత్సాహాన్ని అందించే ఆట వస్తువులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి చిల్డ్రన్స్ పార్కును కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని వివిధ విభాగాలలో అవసరమైన ఏర్పాట్లను అధికారులకు సూచించారు. పార్కులో నూతనంగా నిర్మిస్తున్న జీవ వైవిధ్యం ప్రదర్శన శాల పనులను త్వరితగతిన పూర్తి చేసి పిల్లలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. మరమ్మతులకు గురైన పిల్లల ఆటవస్తువులు, క్రీడా పరికరాల స్థానంలో నూతన పరికరాలు ఏరానపటు చేపట్టాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పార్కులో పారిశుధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. స్థానిక 17వ డివిజన్ కార్పొరేటర్ పి.సుధాకర్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ సంజయ్, డీఈ సురేష్ పాల్గొన్నారు.

## రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ముత్తుకూరు,డిశంబర్14,ప్రభాతవార్త:** మాండూస్ తుఫాను ప్రభావంవల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజి మంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బుదవారం మండలంలోని పిడతాపోలూరు పంచాయతీలోని ఆముదాలపాడు,బ్రహ్మదేవి పంచాయతిలోని లింగాయపాళెం,వల్లూరు,వంటపాళెం పంచాయతీలలో దెబ్బతిన్న నారుమడులను పరిశీలించారు.అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతు జిల్లాలోని రైతులకు అపారనష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.ముత్తుకూరు మండలంలో రైతులకు అపారనష్టం జరిగిందన్నారు.ఈక్రాపు వుంటేనే రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రైతులగూర్చి పట్టించుకోని ప్రభుత్వం ఏదైనా వుందంటే అదివక్క వై.కా.పానేనని ఆయన ఎద్దేవచేశారు.ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు వల్లంరెడ్డి రామ్‌మోహన్‌రెడ్డి,యూత్ అధ్యక్షుడు మునిరెడ్డి,నాయకులు కొత్తపల్లి రమేష్‌శర్మ,అల్లిముత్తు,దండు.శ్రీనివాసులు,అక్కయ్య గారి ఏడుకొండలు,పల్లికొండ శీనయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకు గురైన వరిపొలాలు పరిశీలన



**కోవూరు,డిసెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ముంపుకు గురైన వరి పొలాలను వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి. వినీత, పి. మధ/సూదన్‌రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాతలు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొలాల్లో నీటిమట్టం తగ్గిన తర్వాత కార్బన్‌డిజమ్ ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి వెంటనే పిచికారి చేసుకోవాలన్నారు. నీటిలో పైరు మునిగినందున ఆకులు కాండం కుళ్లుకు గురవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్బన్‌డిజమ్ మందు తప్పక పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మాత్రమే వేసుకోవాలన్నారు. నారుమడికి అరకిలో యూరియా కార్బన్‌డిజమ్ ఒక గ్రాము నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వీఏఏలు శ్వేత, శిరీష, రైతులు ఉన్నారు.

## పించన్ దారులకు మరింత మెరుగైన సేవలు



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** ఫించన్ దారులకు ట్రెజరీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేలా చొరవ తీసుకోవాలని జిల్లా ఖజానా డిప్యూటీ డైరెక్టర్ డి. గంగాద్రి అన్నారు. కోవూరులోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా రికార్డు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు సబ్ ట్రెజరీ కార్యాలయానికి ఈ తాలూకా కార్యాలయంలో స్థలం మంజూరైందని, నిర్మాణానికి గానూ 1.6 కోట్లు వ్యయంతో అంచనాలు వేయడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే ఈ భవన నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులతో చర్చించారు. ఏమైనా సమస్యలు ఎన్నాయా అనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం వర్షాకాలంలో ఉరుస్తుందని, మరమ్మతులు చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఉపఖజానా అధికారి పి. కిరణ్‌కుమార్ డీడీని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ఉన్నారు.

## కొత్త పెన్షన్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న ఎంపిడివో



**అల్లూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త:** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సింగపేట సచివాలయంలో బుధవారం కొత్త పెన్షన్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ నుండి నవంబరు వరకు ఆరు నెలల కాలంలో మండలంలోని అన్ని సచివాలయాల నుండి దరఖాస్తు చేసుకున్న వృద్దాప్య, వితంతు, వికలాంగుల కొత్త పెన్షన్‌లు మొత్తం 231 మందికి రీవెరిఫికేషన్ చేయడం జరిగిందని వీరికి 2023 జనవరి నుండి కొత్త పెన్షన్ అందుకోనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగపేట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



**మర్రిపాడు, డిసెంబర్14ప్రభాతవార్త:** మర్రిపాడు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించామని ప్రధానోపాధ్యాయురాలు శివజ్యోతి తెలిపారు. సీడ్స్ ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహించామని, మండలంలో 12పాఠశాలలు ఉండగా 6పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశామన్నారు. వీరిలో ఇద్దరిని జిల్లా స్థాయి క్విజ్‌పోటీలకు ఎంపిక చేశామన్నారు. దుత్తలూరులో ఈనెల 30న జరిగే జిల్లా స్థాయి క్విజ్‌పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యా వ్యాపారమా?.. విద్యా హక్కు... పిల్లల భవిష్యత్తా?...



**నెల్లూరు టౌన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** విద్యా వ్యాపారమా?... విద్యా హక్కు, పిల్లల భవిష్యత్తు అనే అంశంపై ఈ నెల 18వ తేదీన నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తల్లిదండ్రుల రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని ద పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి తెలిపారు. నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కులపై ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పని చేస్తున్న కళాశాలలు, పాఠశాలలు, అలాగే చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కళాశాలలు, పాఠశాలలపై సూచనలు, సలహాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి స్వీకరించడం జరుగుతుందన్నారు. అనంతరం భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తమ అసోసియేషన్ నిరంతరం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట కోసం, విద్యా హక్కుల కోసం పోరాటం చేయడంలో ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలపై తమ అసోసియేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తద్వారా విజయం సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. నేడు 65 శాతం మాత్రమే అక్షరాస్యత కలిగి ఉన్నారని వీరిలో అతి కొద్ది మంది మాత్రమే పాఠశాల, కళాశాల, ఉన్నత స్థాయి విద్యను అందుకోగలుగుతున్నారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లే క్లాస్ నుంచి కళాశాల స్థాయి వరకు ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రత్యేక నియమ నిబంధనతో చట్టాలు రూపొందించినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు వాటిని అమలు చేయడంలేదని, తద్వారా విద్యా దోపిడీకి గురవుతున్నామని, సమిష్టి కృషితో దీనిని అడ్డుకుని విజయం సాధించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. మన పిల్లల ఉన్నతమైన బంగారు భవిష్యత్తు కోసం ఉన్నతమైన విద్యా అవకాశాల కోసం నిత్యం మన పిల్లలకు విద్యను అందించే విషయంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలనుచర్చించుకుని తద్వారా ఏక పరిష్కార మార్గం కోసం సమిష్టిగా నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నెల 18వ తేదీన ఆదివారం ఉదయం నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సుకు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విజయవంతంగా చేకూర్చాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కో గౌరవ అధ్యక్షులు మల్లిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి రావూరి రమేష్‌బాబు, ఉడతా రాజశేఖర్, కె.శ్రీనివాసరావ, శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్ జంషీద్, దాసరి కమలాకర్, హరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ మేసేజ్‌కు స్పందించిన కలెక్టర్

**ఉలవపాడు, డిసెంబరు 14,ప్రభాతవార్త :** తుఫాను కారణంగా కురిసిన వర్షాల వల్ల మండల పరిధిలోని కరేడు గ్రామంలోని మంచినీటి బావిలోనికి కలుషిత నీరు చేరి ప్రజలు తాగేందుకు ఇబ్బందికరంగా ఉండటంతో కరేడు గ్రామానికి చెందిన మిరియం శ్రీనివాసులు అను వ్యక్తి తాగునీటికి ఇబ్బందుల గురించి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు వాట్సప్ ద్వారా మెసేజ్ పంపడం జరిగింది. తక్షణం స్పందించిన కలెక్టర్ మండల అధికారుల ద్వారా కరేడు గ్రామానికి ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయడం జరిగింది. అంతే కాకుండా వాట్సప్ ద్వారా మెసేజ్ అందించిన మిరియం శ్రీనివాసులకు మంచినీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్ల ఫొటోలను వాట్సప్ ద్వారా తిరిగి పంపించడం జరిగింది. కేవలం వాట్సప్ మెసేజ్‌కు స్పందించి కరేడు ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కరించినందుకు కలెక్టర్ చక్రధర్‌బాబుకు కరేడు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి



**మనుబోలు, డిసెంబరు 14 ప్రభాతవార్త:** మాండౌస్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెంకన్నపాలెం, పిడూరుపాలెం గ్రామాలలో ఆయన మాండౌస్ తుఫాన్‌కు దెబ్బతిన్న వరినారుమళ్ళ పొలాలను బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 5 వేల ఎకరాల నారుమళ్లు అంటే 50 వేల ఎకరాలకు సంబంధించిన వరినాట్లు దెబ్బతిన్నాయన్నారు. ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలలో తాను పర్యటించి వరి నారుమళ్ళు, వేసిన నాట్లను పరిశీలించానన్నారు. నష్టాలు అంచనా వేయడంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వం విఫలమయ్యారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి మాండౌస్ తుఫాన్‌తో నష్టపోయిన ప్రాంతాలను ఇంత వరకు పరిశీలించలేదని విమర్శించారు. రాష్ట్రంలో,జిల్లాలో నియోజకవర్గంలో ఇంత వరకు వ్యవసాయ మంత్రి పర్యటించకపోవడం పట్ల ఆయన నిలదీశారు. అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు ఎందుకు పర్యటించలేదని ప్రశ్నించారు. అలాగే కలెక్టర్ కూడా నామినల్ నష్టమని సరిగా అంచనాలు వేయలేదని ధ్వజమెత్తారు. గోదావరి జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయనందున కురిసిన వర్షాలకు ధాన్యం తడిచి రైతులు బలి అయ్యారన్నారు. అలాగే కొండెపి, ఉదయగిరి, కందుకూరు ప్రాంతాలలో పొగాకు 750 కోట్లు రైతులు నష్టపోయారన్నారు. సోమిరెడ్డి వెంట టిడిపి మండల కన్వీనర్ గాలి రామకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, కనుపూరు కాలువ కమిటీ మాజీ చైర్మన్ వర్దినేని మస్తాన్‌నాయుడు, శివుడురాజా గౌడ్, సాని వెంకట రమణయ్య, చల్లగిరి ప్రసాదు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయానికి కాంపౌండ్ నిర్మాణం



**మర్రిపాడు, డిసెంబర్14ప్రభాతవార్త:** చిలకపాడులోని పోలేరమ్మ దేవస్థానానికి సర్పంచ్ సిద్ధంరెడ్డి రమామోహన్‌రెడ్డి తమ సొంత నిధులు 5లక్షల రూపాయలతో కాంపౌండేవాల్‌ను నిర్మించారు. సుమారు 500అడుగుల పొడవుగల ఈ కాంపౌండే వాల్ నిర్మాణానికి శంఖుస్థాపనకు అతి త్వరలో ముహూర్తంలో జరుగుతుందని గ్రామ ప్రజల సమక్షంలో తెలిపారు. ఇటీవలే శెట్టి సముద్రంలో తమ సొంత నిధుతలో వాటర్‌ప్లాంట్ నిర్మాణం చేసి గ్రామ ప్రజలకు దాహార్తిని తీర్చడం, కాలనీలో ఇళ్ళ స్థలాలు లేనివారికి స్థలాలు సమకూర్చేందుకు చేస్తున్న కృషి ఎనలేనిదని సర్పంచ్ సిద్ధంరెడ్డిరమామోహన్‌రెడ్డిని అభినందించారు. ఈకార్యక్రమంలో మండల వైసిపి నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొరీడ్ సంస్థ ఆధ్వర్యంలో తుఫాను బాధిత గ్రామాల్లో సరుకులు పంపిణీ




**ఉలవపాడు, డిసెంబరు 14,ప్రభాతవార్త:** కొరీడ్ సంస్థ ఆధ్వర్యంలో తుఫాను బాధిత గ్రామాల్లో బుధవారం నిత్యవసర సరుకులు పంపిణీతో పాటు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ డైరక్టర్ డాక్టర్ రావేల జయపాల్ అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జయపాల్ మాట్లాడుతూ సంస్థ ద్వారా ముంపుకు గురైన ఎన్నో గ్రామాలకు సహాయ సహకారాలు అందించడం జరిగిందని అన్నారు. వాతావరణ ప్రభావం వలన ఆరోగ్యాలు దెబ్బతిన్న వృద్ధులకు, పెద్దలకు, చిన్న పిల్లలకు ఉచిత మెగా వైద్యశిబిరాలను నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామప్రజలు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొరీడ్ సంస్థ సూపర్‌వైజర్ దంతం సునీల్‌రాజు, సంస్థ కోఆర్డినేటర్లు పి.వెంకటేశ్వర్లు, బి.తిరుపతిరావు, ఎస్‌కే కాలేషా, పి.సంజయ్ కుమార్‌లు, ఏరియా కోఆర్డినేటర్స్ ఆర్.ఆశీర్వాదం, సురేష్, ఆర్.రవీంద్ర, బ్రహ్మయ్య, కొరీడ్ సిబ్బంది సూరి, శ్రీనివాసులు ఉన్నారు.

## జగన్‌పాలనకు ప్రజలు జేజేలు



**వరికుంటపాడు డిసెంబర్ 14 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారని జేజేలు పలుకుతున్నారంటు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తోటలచెరువుపల్లి,యర్రంరెడ్డిపల్లి గ్రామాలలో ఎంపిడిఒవిజయ్‌బాస్కర్‌రావు,వైసిపి మండల కన్వీనర్ అంద్రాబాలగురవారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని సంక్షేమపథకాల కరపత్రాలను ప్రజలకు అందించేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.తోటల చెరువుపల్లి గ్రామంలో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయని అంతర్గత రోడ్లు సరిగా లేనందున ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు త్వరితగతిన బోర్లు వేయాలని సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతు గడపగడపకు ప్రజలకు ఘనస్వాగతాలు పలుకుతున్నారని జగన్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తి కరంగా ఉనా ్నరని అన్నారు. 2024లో కూడా జగన్‌ను ముఖ్యమంత్రిగా తనను ఎమ్మెల్యే ప్రజలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార ్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కామేపల్లి వెంకటరత్నం, ఎర్రంరెడ్డిపల్లి సర్పంచ్ నాదేండ్ల రంగయ్య, అధికారులు ఏఇపిఆర్ రవీంద్రబాబు,ఆర్‌డబ్ల్యూసి హానిమిసీ, ఎపిఒ శ్రీనివాసులు,వైస్ ఎంపిపి మధు, ఉదయగిరి కన్వీనర్ అక్కి బాస్కర్‌రెడ్డి,స్దానిక నేతలు నాదెండ్ల రమేష్, పిడుగు బాల చంద్రా,మాలకొండయ్య,జానీ,వెంకయ్య,భీమయ్య, మానం మస్తానయ్య,మాజీ మండల కన్వీనర్ గంగవరపు పుల్లయ్యనాయుడు, మాజీ జడ్‌పిటిసి బోగినేని శ్రీనివాసులు, వివిధ గ్రామాల ప్రజలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మాణదశలో ఉన్న జెడ్పీ పాఠశాల శ్లాబు కూలిపోవడం దారుణం



**నెల్లూరు,డిసెంబరు14 ప్రభాతవార్త-విద్య:** నగరంలోని స్థానిక పొదలకూరురోడ్డులో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం కూలిపోవటం దారుణమని, విద్యార్థులు లేరు కనుక పెను ప్రమాదం తప్పిందని నాణ్యతలేని నిర్మాణాలను చేపడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లాప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ డిమాండ్‌చేశారు. బుధవారం ఆయన స్ధానిక నాయకులతో కలిసి భవనం పడిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గునుకుల మాట్లాడుతు నిర్మాణదశలో ఉన్నభవనం కూలిపోవటం చూసు ్తంటే నిర్మాణాల్లో నాణ్యతప్రమాణాలు ఏమాత్రం పాటిస్తున్నారో అర్ధమౌతుందన్నారు. విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించి వారి బౌవిష్యత్‌ను తీర్ధిదిదాల్సిన పాఠశాలల్లోనే అవినీతి జరుగుతుండటం విచారకరమన్నారు. అదృష్టం బాంగుంటి కూలే సమయంలో విద్యార్థులు లేరని ఆదే నాశిరకం భవనం నిర్మాణం పూర్తిచేకుని వందలమంది విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తరువార ప్రమాదం జరిగి ఉంటే తీరని నష్టం వాటిల్లేదన్నారు. అవినీతి మయంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేయ్యాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు పనులు వైకానా పాయకుల పాలిట కామదేనువుల్లా మారాయని, ఎక్కడా నిర్మాణాలు పూర్తికాలేదన్నారు. నాడు నేడు పనులపై వాస్తవాలను వెలికి తీసేందుకు జిల్లా కలెక్టర్ త్రీమెన్ కమిటీని ఏర్పాటుచేయ్యాలని డిమాండ్ చేశారు. నాడు నేడు పనుల నాణ్యతను ప్రత్యక్ష్యంగా పరీక్షించేందుకు రానున్న రోజుల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో జిలా ్లవ్యాప్తంగా పర్యటించి అవినీతిని ఎక్కడికక్కడ ఎండగడతామహెచ్చరించారు. వెంటనే నాశిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను విధులనుండి తొలగించి నూతనంగా టెండర్లు పిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంధర్, అమీన్, అలేఖ్, ప్రసన్న, మౌనేష్, ఇంతియాజ్, షాజహాన్, హేమంత్ యాదవ్, రాజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపవర్‌ను ప్రారంభించిన ఆదిత్యబిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు

**నెల్లూరు,డిసెంబరు14 ప్రభాతవార్త-విద్య**భారతదేశంలో మానసిక ఆరోగ్యం చుటూ ఉన్న భయాలను పొగ్గొటేందుకు, విద్యార్థుల్లో కమ్యునికేషన్ స్కిల్ ్సను పెంపొందించేదుకు ఎం పవర్‌ను ప్రారంభించటం జరిగిందని ఆదిత్యబిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రతినిదులు పేర్కొన్నారు. బుధవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు దేశంలోని యువతరం మానశిక ఆరోగ్యానికి సంభందించిన సమస్యలను తాను రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మానశిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా 200మందికిపైగా అనుభవజ్ఞలైన అధ్యాపకుల సేవలను వినియోగించుకోనున్నామని వారు తెలిపారు. వీరి సంఖ్య చిన్నదైనా సుమారు 121మినియన్ల మందికి మానశిక సమస్యలను రాకుండా ఆపగలుగుతారన్నారు. అంతర్జాతీయంగా కూడా ఆరోగ్యనిర్వహణలో సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉన్న మెడిక్స్‌ను కూడా తాము ఈ కార్యక్రమంలో బాగస్వాములను చేసుకోవటం జరిగిందన్నారు. ఈ భాగస్వామ్యంతో ఎంపవర్ మరింత సమర్ధవంతంగా తన విధులు నిర ్వహించనుందని డాక్టర్ నీరజ్‌బిల్లా తెలిపారు.ప్రధానంగా 16నుండి 35 ఏళ్ల మద్యవయస్సు ఉన్న యువతలో తరుచుగా కనిపించే ఒత్తిడి, ఆందోళణ ,ఆత్మన్యూనత, మూడ్ చేర్ వంటి వాటిని ప్రభావితం చేస్తమన్నారు. వీటికి నూతన టెక్నాలజీతో సత్వరంగా పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని పేర్నొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హఠావో - ముస్లీం మైనారిటీ బచావో...




**నెల్లూరు అర్బన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ముస్లీం మైనారిటీ నేతలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ నేత అల్లాభక్షుపై దాడితో పాటు మైనార్టీ నేత సాబీర్‌ఖాన్‌పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ముస్లీం మైనార్టీలు నెల్లూరు వీఆర్‌సీ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హఠావో ముస్లీం మైనారిటీ బచావో అని రూరల్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ మైనారిటీ అధికార ప్రతినిధి హయాత్‌బాబా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు ముస్లీం నేతలపై దాడులు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. మాట్లాడితే కేసులు పెట్టేస్తారా, ప్రశ్నిస్తే చంపేస్తారా అని ప్రశ్నించారు. శ్రీధర్‌రెడ్డి ముస్లీంలపై చూపే వివక్షత, గూండా వైఖరి మానుకోకపోతే ఇన్ని రోజులు ముస్లీంల అభిమానం చూశారని, ఇకపై ముస్లీంల ఆవేశం చూస్తారని హెచ్చరించారు. స్థానికంగా ఉన్న 31వ డివిజన్‌లో బాదుడే బాదుడు నిర్వహించి ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు రూరల్ ఎమ్మెల్యే స్వయానా తన అనుచరులతో కలిసి తాగేసి నన్ను చంపేయాలని కేకలు వేశారన్నారు. తనపై జరిగిన దాడి గురించి మైనార్టీ కమిషన్‌కు, రాష్ట్ర డీజీపీకి, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనపై దాడి చేసిన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నగర మైనార్టీ టీడీపీ అధ్యక్షులు సాబీర్‌ఖాన్ మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి కౌగిలి ధృతరాష్ట్రుడి కౌగిలని, అతని హస్తం భస్మాసురుడి హస్తమని విమర్శించారు. 430 మంది పిల్లల్ని చదివిస్తున్నా అని గొప్పలు చెప్పుకునే శ్రీధర్‌రెడ్డికి నాపై అక్రమ కేసు నమోదు చేసినప్పుడు నా బిడ్డల భవిష్యత్తు కనబడలేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. తనకి, అల్లాభక్షుకి ఏదైనా హాని జరిగితే దానికి పూర్తి బాధ్యత ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిదేనని, మాకేదైనా జరిగితే మా కుటుంబసభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఎవరూ ఊరికే ఉండరని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మురికి కాలువలో దిగారని, ప్రజలకు మరింత సేవ అందిస్తారని గెలిపిస్తే ముస్లీం నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేసిన పనులు తన పెద్దరికానికి మచ్చ అని, అసలు ఆయన ఎమ్మెల్యే పదవిలో ఉండడానికి అర్హుడేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నేతలు, జాఫర్ షరీఫ్, ఆసిఫ్‌పాషా, మైనుద్దీన్, జహీర్, అస్లాం, సర్తాజ్, సత్తార్, ఇక్బాల్, ఇలియాస్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**నెల్లూరు,డిసెంబరు14 ప్రభాతవార్త-విద్య:** జనసేన పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి అసువులు బాసిన అరవ విజయ్‌కాంత్ ప్రథమవర్ధంతి ని పురస్కరిచుకుని జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ ఆద ్వర్యంలో నగరంలోనిస్ధానిక 33వ డివిజన్ వెంగళరావునగర్‌లో మోగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రిబ్బన్ కట్‌చేసి ఈ శిబిరాన్ని కిషోర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మంచి వ్యక్తి, వివాధ రహితుడు, కర్రసాములో ప్రావీణ్యతను సంపాదించిన అవర విజయ్‌కాంత్ చిన్నవయస్సులోనే తిగిరిరాని లోకాలకు వెల్లడం శోచనీయమన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో 33వ డివిజన్‌లో తమ పార్టీకి మద్దతు అదికింగా ఉందని, ఇందుకు కారణం విజయ్ అని తెలిపారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిది అని పేర్కొన్నారు. అలాగే తమ పార్టీ తరనుకు లెక్కకు మించిన తమ్ముళ్లను ఇవ్వటం గర్వకారణమన్నారు. మంచి మిత్రుడిని కోల్పోయి కూడా సహచర మిత్రులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి వేరోకరికి ప్రాణదానం చేయ్యాలనుకోవటం స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానం చేయటం అంటే ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయటమేనని, ప్రతి ఒక్కరు విదిగా రక్తదాతలుగా మారాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో 53యూనిట్ల రక్తాన్ని నోవా బ్లడ్‌బ్యాంక్‌కు అందించటం జరిగిందన్నారు. తాము అడగగానే రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన నోవా వారికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవరవిజయ్‌కాంత్ కుటుంబానికి ఆదేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, జాన్, పాల్,ఉద్దేష్, మిధున్, కందర్, అమీన్, అలేఖ్,ఖలీల్, ప్రసన్న, ఇంతియాజ్, షాజహాన్, హేమంత్ యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకంగా ఉంటూ నగలు దోచేశాడు



**వింజమూరు, డిసెంబర్14ప్రభాతవార్త:** వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో పోలు నాగిరెడ్డి ఇంట్లో రెండు రోజుల క్రితం బంగారు, నగదు చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు 11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలు నాగిరెడ్డి నివాసంప్రక్కనే బ్రతుకుదెరువుకొరకు యుపి నుంచి వచ్చి పానిపూరీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సన్‌పాల్ , మోను, అరవింద్ అనే వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని కావలి డియస్పీ ఎం.వెంకటరమణ బుధవారం తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డియస్పీ మాట్లాడుతూ పోలు నాగిరెడ్డి ఇంట్లో 9లక్షలా 89వేల రూపాయల విలువ చేసే నగదు, బంగారు చోరీకి గురైంద న్నారు. అప్పటి నుండి పానీపూరీ వ్యాపారం చేసే వారు కనిపించకపోవడంతో నాగిరెడ్డి వారిపై అనుమానం వ్యక్తం చేయడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారిని వింజమూరులోని శ్రీరాఘవేంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా వారి నుండి 24సవర్ల బంగారు, వెండికాసులు 2, నగదు 25వేల రూపాయలను చోరీ చేసినట్లు నిర్ధారణైంది. వారు గతంలో వింజమూరు పానీపూరి వ్యాపారం చేసుకొని జీవించేవారని, 8నెలల క్రితం గుండెమడకల గ్రామంలో వ్యాపారం చేసుకుంటూ అక్కడే నాగిరెడ్డి ఇంటిప్రక్కన అద్దెకు దిగారన్నారు. నాగిరెడ్డి వంటరివాడు కావడంతో ఆయన సే ్నహంగా ఉంటూ వారి కుటుంబ విషయాలను గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం కట్టెలు తెచ్చుకునేందుకు సహాయంగా రావాలని నాగిరెడ్డిని కోరగా వారితో కలిసి ద్విచక్రవాహనంపై శంఖవరం వైపు కట్టెలకు వచ్చారన్నారు. ఈక్రమంలో ఇంటివద్దనున్న ఇద్దరు బీరువాను గడ్డపారతో పగులగొట్టి బీరువాలోని నగదు, బంగారు, వెండిని చోరీ చేశారన్నారు. వీరిని కలిగిరి సిఐ సాంబశివరావ్, వింజమూరు ఎస్ఐ జంపాని కుమార్‌లు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి పై నిఘా ఉంచారన్నారు. ఈమేరకు పానీపూరీ వ్యాపారులను స్వాధీనం చేసుకొని 9,86,500రూపాయలను రికవరీ చేయించారు. రెండురోజుల్లో కేసును చేధించిన ఎస్ఐ జంపాని కుమార్‌ను, కానిస్టేబుల్ నారాయణను డియస్పీ అభినందించారు. ఎస్ఐకి రివార్డును అందజేశారు.

## దివ్యాంగుడు వెంకట మణికి సహాయం చేసి ఆదుకోవాలి



**కావలి రూరల్, డిసెంబరు 14 ప్రభాతవార్త** మంచానికే పరిమితమై ఎటూకదలకుండా మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్న దివ్యాంగుడు కోపూరు వెంకట మణికి డాక్టర్లు, అధికారులు సహాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకో వాలని వైసిపి కావలి నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు పోసిన వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం గ్రామానికి చెందిన కోపూరు సురేష్, నీలిమ దంపతులకు చెందిన పది సంవత్సరాల వయసు కల్గిన కుమారుడు కోపూరు వెంకట రమణ మంచానికే పరిమితమై వున్నాడన్నారు. అంతేకాకుండా మూర్ఛ వ్యాధితో కూడా బాధపడుతున్నాడని తెలిపారు. ఈ దివ్యాంగుడికి 3 వేల రూపాయల దివ్యాంగుడి పెన్షన్ వస్తుందన్నారు. ఎటూ కదలలేని స్థితిలో వుండటంతో తల్లిదండ్రులలో ఎవరో ఒకరు ఆ బాలుడు సంరక్షణ కోసం ఇంటిలోనే వుండాల్సి వస్తుందన్నారు. ఆ బాలుడు తల్లిదండ్రులు కటిక పేదవారని తెలిపారు. కూలి చేసుకుంటేనే ఆ కుటుంబ పోషణ అని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని దివ్యాంగ బాలుడు కోపూరు వెంకట మణిని డాక్టర్లు పరిశీలించి పూర్తి దివ్యాంగుడికి ఇచ్చే 5 వేల రూపాయలు పెన్షన్ వచ్చే విధంగా డాక్టర్లు, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పోసిన వెంకట్రావు కోరారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్వోల నిరసన



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం ఆదేశల మేంకు బుధవారం సైతం కోవూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ అధికారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఈ కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం జిల్లా అధ్యక్షుడు పి. అశోక్‌కుమార్‌రెడ్డి, ఎం. నాగేశ్వరరరావు, ఏ. ప్రసాద్‌నాయుడు, జగదీష్‌లు మాట్లాడుతూ వీఆర్వోలకు పనిఒత్తిడి తగ్గించాలని, పనిఒత్తిడి కారణంగా మృతిచెందిన వీఆర్వోలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు 658 జీవో ప్రకారం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా పీవోఎల్ఆర్ కొరకు ఖర్చులు వేలకు వేలు వీఆర్వోలు భరించారని, ప్రభుత్వం తరపున ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం సర్వే కూడా వీఆర్వోల డబ్బులతో ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి జి. విజయ్‌కాంత్, జ్యోతి, సుజాత, జయశ్రీ, రమేష్, రమణమ్మ, జయరాజ్, ఎన్. నాగేశ్వరరావు, సుభాషిణి తదితరులు ఉన్నారు.

## ఇంధనాన్ని పొదుపు చేసేలా దృష్టి సారించాలి



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని పంచాయతీ రాజ్ పొదలకూరు ప్రాజెక్టు డీఈ పి. సుబ్రహ్మణ్యం అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనాన్ని తమ ఇష్టానుసారంగా వాడడం వలన పర్యావరణం పూర్తిగా దెబ్బతిని వాతావరణంలో సమతుల్యత ఏర్పడుతుందన్నారు. దీని వలన పర్యావరణానికి పూర్తిగా నష్టం వాటిల్లే పరిస్థితి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్, ఐఐసీసీ విభాగాధిపతి డాక్టర్ డి. చక్రపాణి, సమన్వయకర్త టి. సాయిప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## ఇంధనం పొదుపు అందరి బాధ్యత



**నెల్లూరు టౌన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పొదుపు అందరి బాధ్యత అని, దేశంలో ఇంధనాల వృధాను అరికట్టి ఇంధన పొదుపు కోసం ప్రభుత్వాలు వినూత్న కార్యక్రమాలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సినీ దర్శకుడు మహేష్‌చంద్ పేర్కొన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు నగరం కొండాయపాళెం గేట్ సెంటర్ నందు జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేస్తే ఇంధనాన్ని ఉత్పత్తి చేసినట్టేనని, ఇంధనాన్ని పరిరక్షణగా భావించాలని కోరారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం యేటా డిసెంబరు 14వ తేదీన జరుపుతారన్నారు. 1991 నుంచి కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ దినో త్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజు, ఎం. భాస్కర్‌రావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 80 శాతంపై వరి విత్తనాలు



**బుచ్చి డిసెంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు ,పెనుబల్లి గ్రామాలలో వర్షాలకు నార్లు, వరినాట్లుదెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై వారి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం సురేంద్రరెడ్డి తెలిపారు. మండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరిపొలాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతు రైతులు పొలాలలో నిలిచిన నీటిని వెంటనే తొలగించుకోవాలని ఆయన సూచించారు. నాటిన వరికుళ్లి ఉన్నందున నివారణకు కార్బండిజమ్ 2 లేదా 3 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల సమస్యను నివారించుకోవచ్చునని తెలిపారు. పంటదెబ్బతిన్న రైతులకు ఆర్బికేల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వీఏఏలు ,రైతులు పాల్గొన్నారు.

## లంపిస్కీమ డిసిజ్ వల్ల ప్రాణహాని లేదు



ఉదయగిరి డిసెంబర్ 14 ప్రభాతవార్త లంపిస్కీమ్ డిసిజ్ బొబ్బవ్యాధి రకానికి చెందిన వైరస్‌వ్యాధి అని ఈ వ్యాధి గోవు జాతి పశువులలో మాత్రమే వస్తుందని ఉదయగిరి వెటర్నటి అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ ఎస్ శశిదర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుఉదయగిరి మండల పరిధిలోని గ్రామాలలో గోవు జాతికి వ్యాక్సినేషన్ చేయడం జరిగిందని చెప్పారు. ఈ లంపిస్కీమ్ డిసిజ్ దేశమంతా ఉన్నప్పటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం చాలా తక్కువ చోట్ల ఉందని తెలిపారు. మన నాటుజాతి ఆవులలో రోగనిరోదక శక్తి ఎక్కువగా ఉండడం వల్ల ప్రాణహాని ప్రస్తుతం లేదు. కాని లేగ దూడలలో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాధి సోకిన లేగదూడలకు సరైన వైద్యం అందకపోతే అయి కంతులుగా మారి గడ్డలుపగలి పుండ్లుగా ఏర్పడతాయి. ఈ వ్యాధికి సరైన మందు లేని కారణంగా నివారణకు యాంటిబైటిక్ వాడతు అయివర్‌మెటిన్ ఇంజక్షన్ తప్పని సరిగా వాడాలి. అదే విధంగా ఆయుర్వేదం మందు తమలపాకు, పసు పు, మిరియాలు, తులసిఆకులు, వెల్లుల్లి, వీటితో మందు తయారు చేసుకొని ప్రతి రెండు గంటలకు ఒకసారి తినిపించాలి. అలాగే వేపనూనె పసుపు, కలబంధ వెల్లుల్లి మెత్తగా నూరి పూత మందుగా తయారు చేసి కణితల మీద రాస్తే త్వరగా మానిపో తాయి. రైతులు సరైన జాగ్రత్తలు తీసుకుంటు పైన చెప్పిన విధంగా వైద్యం చేసిన ఎడల మన పశుసందను కాపాడుకోవచ్చునని తెలిపారు.

**దాక్యుమెంటు పోయినది**

షేక్ జాఫర్ సాహెబ్ మరియు షేక్ షాహిన భర్త షేక్ జమీర్ లకు చెందిన లింక్ దాక్యుమెంట్ నెం. 1487/ 2013 ఫ్లాట్ నెం.47 లింక్ దాక్యుమెంటు పొదలకూరులో బైక్‌పై వెళ్ళుతుండగా మార్గమధ్యంలో పోయినవి. సదరు దాక్యుమెంటు ఎవరికైనను దొరికిన ఎడల సెల్: 9160353330, 6309498841 కు తెలియజేసి,తెచ్చిఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

## చిరు వ్యాపారులపై దాడులు తగదు



**నెల్లూరు డిసెంబర్ 14, ప్రభాతవార్త– వైద్యం** నగరంలో చిరు వ్యాపారులపై తూనికల, కొలతల శాఖాధికారులు దా డులు చేయడం దారుణమని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ అధ్య క్షుడు ధర్మవరం. సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. తూనికల, కొలతల శాఖ దాడులకు నిర సనగా చిన్న బజారు, పెద్దబజారు, మండ పాల వీధి, కొరదా వీధి తదితర ప్రాంతాల్లో బడా బంగారు వ్యా పారుల కేంద్రాలను తనిఖీలు చేసి, కొంతమంది మీద కేసులు నమోదు చేస్తుండడంతో అధికారుల తీరుకు నిరసనగా, బుధవారం నగరంలోని బంగారు వ్యాపారులంతా వారి వారి దుకాణాలకు బంద్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో వ్యాపారులంతా కలిసి టీడీపీ నగ ర నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మవరం. సుబ్బారావుని కలిసి వారి ఆవేదనను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితి చాలా దమనీయంగా తయారైందన్నారు. సామాన్య, మధ్య తరగతి బతుకులు భారంగా మారాయన్నారు. జగన్‌కి డబ్బు పిచ్చిపట్టి అన్ని రకాల వ్యాపారాలు చేసు కుంటున్న వారందరినీ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నా డ న్నారు. నగరంలో నేడు జరుగుతున్న దాడులు ఇప్పటి వరకు ఎన్నడూ చూడలేద న్నారు. తూనికల కొలతల అధికారులు ఏదో రకంగా అక్రమంగా కేసులు బనాయించి డబ్బులు గుంజుకోవాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. దాడులతోబంగారు వ్యా పారస్తులు భయాందోళనలతో దుకాణాలు మూసి, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అధికారులకు జీతాలు ఇచ్చే పరిస్థితులు లేవు కాబట్టే ప్రజల ను, వ్యాపారులను పీల్చుకుతినమని జగన్ చెప్పకనే అధికారులకు చెపుతున్నాడని మం డిపడ్డాడు. జగన్ చేస్తున్న తుగ్లక్ పనులకి త్వరలోనే ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

## ఈక్రాప్ చేయించుకుంటే నష్టపరిహారం




**ఉదయగిరి డిసెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని వ్యవసాయ కేంద్రంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతు మండలం లోని ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకో వాలని తెలిపారు. ఈక్రాప్ చేయించుకుంటనే నష్టపరిహారం వస్తుందని పంటకు ఇ నూ స్రెన్స్ ఉంటుందని తెలిపారు. ఉదయ గిరి మండల పరిధిలో సుమారు 170 ఏకరాల వరిపంటకు రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకున్నారని అలాగే ఈ రబీసీజన్‌లో వేయబోయే వాణిజ్య పంటలకు కూడా ఖచ్చితంగా ఈక్రాప్ చేసుకోవాలని తెలిపారు. వివిఏల ద్వారా గ్రామాలలో ఏర్పాటు చేసే సభలకు రైతులకు హాజరై ఈక్రాప్‌లో ఎదురయ్యే సమస్యల గురించి సందేహం గురించి సలహాలు అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

## మాదకద్రవ్యాలు మానవాళికి ప్రమాదం

**జలదంకి, డిశంబర్14, ప్రభాతవార్త :** మాదకద్రవ్యాల వినియోగం మానవాళికి పెను ప్రమాదమని సామాజిక కార్యకర్త ఎం. మాలకొండారెడ్డి అన్నారు. వీటి బారీనపడిముఖ్యంగా యువత తమ కెరీర్‌ను నాశనం చేసుకుం టున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన జలదంకిలో దీనిపై మాట్లాడుతు యువత నల్ల మందు, గంజాయి, బ్రౌన్‌షుగర్, వంటి మత్తుపదార్థాలవల్ల నిర్వీర్యమౌతున్నారని తెలిపారు. దీనిని అరిక ట్టాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌరసంస్థలు, ఎక్సైజ్‌శాఖ కలసికట్టుగ గ్రామాలలో యువ త, ప్రజలను చైతన్యవరచాల్సి న అవసరం ఎంతైనావుందన్నారు. అలాగే చట్టాన్ని పటిష్టంగ అమలు చేసేవి ధంగా కృషిచేసి ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణానికి కృషిచేయాల్సి న అవసరం వుందన్నారు.

## కొడవలూరు ధనుంజయరెడ్డి రావడం హర్షనీయం



**సీతారామపురం డిసెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజవకర్గ వైసిపి పరిశీలకుడుగా కొడవలూరు ధనుంజయరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడం శుభపరిణామమని మాజీ జడ్‌పిటిసి సభ్యులు పెద్దిరెడ్డి గురువారెడ్డి రాష్ట్ర బిసి కార్పోరేషన్ డైరక్టర్ సీతారామపురం బిట్–1 ఎంపిటిసి అల్లూరురాజులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీతారామపురంలో వారు విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతు నియోజకవర్గంలోని 8 మండలాలలోని వైసిపిలో ఉన్న అసంతృప్తిలను బుజ్జగిస్తు పార్టీ క్యాడర్ అందర్ని కలుపుకొని వైసిపి బలోపేతానికి ధనుంజయరెడ్డి రచించిన ప్రణాళికను తామంతా స్వాగతిస్తామన్నారు. త్వరలో ఆయన పర్యటననియోజకవర్గంలో ఉంటుందని అందరి అభిప్రాయాలను సేకరించి వారి నుండి సూచనలను సలహాలను తీసుకొని అసంతృప్తి వాదలందర్ని ఏకతాటిపై తీసుకొని వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జనవరి నుండి వృద్దాప్య పెన్షన్ 2750కి పెంచేలా క్యాబినేట్ తీర్మానం చేయడం శుభపరిణామమని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి నేలటూరు అబ్రహాం, దేవిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్, నాయకులు కొండారెడ్డి, శ్రీదర్‌రెడ్డి, సుమదర్‌రెడ్డి, రేనాడి లక్ష్మయ్య, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లా కుటుంబానికి రాజ్యసభ సభ్యులు బీద 50 వేలు ఆర్థిక సహాయం



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న నూర్‌బాషా కులస్తుడైన షేక్ అబ్దుల్లా కుటుంబానికి రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీద మస్తాన్‌రావు బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం 50 వేలు నగదు అందజేశారు. అబ్దుల్లా ఆర్థిక పరిస్థితులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ పరిస్థితులు బాగలేవని ఆదుకోవాలని కావలి నూర్‌బాషా సంఘం అధ్యక్షులు ఖలీల్ బీద దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన బీద మస్తాన్‌రావు అబ్దుల్లా కుటుంబానికి నెల్లూరు నూర్‌బాషా సంఘం ద్వారా 50 వేల రూపాయల నగదు అందజేశారు. అబ్దుల్లా భార్య కరీమా, కుమార్తెకు ఈ నగదును అందజేశారు. నూర్‌బాషా సంఘం నేతలు బీదకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, బాబర్‌జాన్, హుస్సేన్ సాహెబ్, గౌరవాధ్యక్షులు మహబూబ్‌బాషా, కావలి మండల అధ్యక్షులు షేక్ ఖలీల్, ఉపాధ్యక్షులు షేక్ కాళేమస్తాన్, చాంద్‌బాషా, మస్తాన్, గౌస్‌బాషా, మస్తాన్‌వలి, షాన్‌వాజ్, అహ్మద్‌బాషా, రఫీ, పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

**వింజమూరు, డిసెంబర్14ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ తూర్పురాయలసీమ ఉపాధ్యాయ సంఘ ఎమ్మెల్సీ అభ్యర్థి పుట్టుబోయిన బ్రహ్మానందం ఎన్నికల ప్రచారంలో భాగంగా వింజమూరు మండలంలో బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నానని, గతంలో గెలిచిన అభ్యర్థులకంటే తాను ఎమ్మెల్సీనైతే ప్రతి కూల పరిస్థితుల్లో కూడా పోరాడే మనోనిబ్బరం , వత్తిడులకు తలొగ్గని ధైర్యంతో సమస్యలపై పోరాడతానన్నారు. తాను ఒక సామాన్య కుటుంబంలో జన్మించి బాల్యం నుంచి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తగా జాతీయభావాలు , దేశభక్తి ప్రేరణతో పెరిగి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా అఖిలభారత విద్యాపరిషత్‌లో పనిచేశానన్నారు. విద్యార్థిసంఘాల ఎన్నికల్లో అప్రతిహత విజయాలను సొంతం చేసుకొని విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశానన్నారు. ప్రస్తుతం కావలిలో జవహర్‌భారతి కళాశాలలో అధ్యాపకవృత్తి చేపట్టి తన సేవలను నిరంతరాయంగా విద్యారంగంలో కొనసాగిస్తున్నానన్నారు. ప్రభుత్వ, ప్రవేటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపట్ల అవగాహన ఉందన్నారు. తాను అపస్ బలపరచిన తూర్పురాయలసీమ అభ్యర్థిగా బరిలో నిలిచానన్నారు. తన గెలుపుకు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో సుబ్బారావ్, శివప్రసాద్, మందా శ్రీనివాసులు, కె.రంగారావ్, కృష్ణారెడ్డి, తిరుపతిస్వామి, మందా కిరణ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈక్రాప్ నమోదు చేసుకోండి

**జలదంకి, డిశంబర్14, ప్రభాతవార్త:** వరి, ఇతర పంటలు సాగుచేసే రైతులందరు తప్పనిసరిగ ఈక్రాపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సైలజ పేర్కొ న్నారు. బుధవారం ఆమె ఒకప్రకటన విడుదలచేసి ఈమేరకు రైతులకు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుతం ఈకర్షక్ యాప్ అందు బాటులో వుందికాబట్టి కర్షకులు ఆయా పంచాయతీలలోని రైతుబరోసాకేంద్రాలలో సంప్రదిస్తే నమోదుకు సిబ్బంది ఎప్పుడు అందుబాటులో వుంటారని కావున అందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎ.ఒ కోరారు. రైతులు వారివారి ఆదార్‌కార్డు, ఆర్.ఒ.ఆర్, వన్.బి, వెంటతీనుకురావాలని సూచించారు.

## స్వామి చెరువు పరిశీలించిన ఇరిగేషన్ డిఇ



**సీతారామపురం డిసెంబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని స్వామి చెరువు తూము నుండి నీరు లీకౌతుందని కథనాలు రావడంతో బుధవారం ఇరిగేషన్ డిఇ శంకర్‌నారాయణ ,ఏఇ విక్రమ్‌లు స్వామి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతు తూము మరమ్మత్తులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. తూముకు సంబంధించి లీకేజి పోటోలను ,తూము పరిస్థితులను ఉన్నతాధికారులకు వివ రించడం జరిగిందనిఅన్నారు. తూము శాశ్వత మరమ్మత్తులు చేయుటకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు.

## డియస్పీ కి సన్మానం



**వింజమూరు, డిసెంబర్14ప్రభాతవార్త:** వింజమూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో కావలి డియస్పీ ఎం.వెంకటరమణను కనూ జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఉదయగిరి నియోజకవర్గ ఛైర్మెన్ కదిరి వెంకటరంగారావ్, జిల్లా ఇసిమెంబర్ కోవూరు సాయికుమార్ బుధవారం డియస్పీని కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా వారు తమ ఫోరం చేస్తున్న సేవలను డియస్పీకి వివరించారు . ఈ కార్యక్రమంలో మీడియా అడ్వైజర్ లెక్కమనేని రాజేష్‌నాయుడు, కలిగిరి సిఐ సాంబశివరావ్, వింజమూరు ఎస్ఐ జంపానికుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the 1st Addl. District Judge:: Nellore
I.A.No.19/2021
O.S.No.23/2006
1.Rebala Pattabhirami Reddy Charities, Rep.by its Trustees, having its office at Gandhi Nagar, Nellore
1.Katam Reddy Subba Reddy (died) and others
... Petitioners/ Plaintiffs
Vs
1.Devireddy Sulochanamma (died) and Others
... Respondents/ Defendants
Notice
To,
R37: Tanguturu Srikeerthi D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
R38: Guduru Kavya Reddy D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
పై నెంబరున పిటీషనర్లు/వాదులు పై దావాలో 28వ ప్రతివాది అయిన టంగుటూరు హరిశ్చంద్రారెడ్డి చనిపోయినందున ఆయన వారసులుగా మిమ్మల్ని చేర్చడంలో ఆలస్యమైనందును ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో సెక్షన్ 5 ఆఫ్ లిమిటేషన్ యాక్ట్ ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే.27-12-2022దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులురెడ్డి, బి.యస్.సి., బి.యల్., పిటిషనర్లు/వాదుల తరఫు అడ్వకేట్, నెల్లూరు

In the Court of the 1st Addl. District Judge:: Nellore
I.A.No.20/2021
O.S.No.23/2006
1.Rebala Pattabhirami Reddy Charities, Rep.by its Trustees, having its office at Gandhi Nagar, Nellore
1.Katam Reddy Subba Reddy (died) and others
... Petitioners/ Plaintiffs
Vs
1.Devireddy Sulochanamma (died) and Others
... Respondents/ Defendants
Notice
To,
R37: Tanguturu Srikeerthi D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
R38: Guduru Kavya Reddy D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
పై నెంబరున పిటీషనర్లు/వాదులు పై దావాలో 28వ ప్రతివాది అయిన టంగుటూరు హరిశ్చంద్రారెడ్డి చనిపోయినందున ఎల్.ఆర్స్ పిటీషన్ సమయానికి వేయనందుకు అబేట్‌మెంట్ అయినందున, అబేట్‌మెంట్ ఆర్డర్‌ని సెట్‌సైడ్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే.27-12-2022దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసిన నది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులురెడ్డి, బి.యస్.సి., బి.యల్., పిటిషనర్లు/వాదుల తరఫు అడ్వకేట్, నెల్లూరు

In the Court of the 1st Addl. District Judge:: Nellore
I.A.No.21/2021
O.S.No.23/2006
1.Rebala Pattabhirami Reddy Charities, Rep.by its Trustees, having its office at Gandhi Nagar, Nellore
1.Katam Reddy Subba Reddy (died) and others
... Petitioners/ Plaintiffs
Vs
1.Devireddy Sulochanamma (died) and Others
... Respondents/ Defendants
Notice
To,
R37: Tanguturu Srikeerthi D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
R38: Guduru Kavya Reddy D/o. Late Harischandra Reddy, Residing at House No.11-A, Prashanth Kuteer, Saraswathi Nagar, Dargamitta, Nellore City-3.
పై నెంబరున పిటీషనర్లు/వాదులు పై దావాలో 28వ ప్రతివాది అయిన టంగుటూరు హరిశ్చంద్రారెడ్డి చనిపోయినందున ఆయన వారసులుగా మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే.27-12-2022దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులురెడ్డి, బి.యస్.సి., బి.యల్., పిటిషనర్లు/వాదుల తరఫు అడ్వకేట్, నెల్లూరు

In the Court of the 1st Addl. District Judge:: Nellore
I.A.No.22/2021
O.S.No.23/2006
1.Rebala Pattabhirami Reddy Charities, Rep.by its Trustees, having its office at Gandhi Nagar, Nellore
1.Katam Reddy Subba Reddy (died) and others
... Petitioners/ Plaintiffs
Vs
1.Devireddy Sulochanamma (died) and Others
... Respondents/ Defendants
Notice
To,
R36: Palicherla Avinash Kumar Reddy S/o. Late Phani Prasanna Kumar Reddy, Residing at Venkatadri Homes, Magunta Layout Main Road, Nellore City -3.
పై నెంబరున పిటీషనర్లు/వాదులు పై దావాలో 35వ ప్రతివాది అయిన పాలిచెర్ల ఫణి ప్రసన్నకుమార్‌రెడ్డి చనిపోయినందున ఆయన వారసులుగా మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఎల్.ఆర్స్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే.27-12-2022దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులురెడ్డి, బి.యస్.సి., బి.యల్., పిటిషనర్లు/వాదుల తరఫు అడ్వకేట్, నెల్లూరు

## పారిశ్రామికవేత్త బాలశంకర్‌రెడ్డికి ఘన సన్మానం



**బుచ్చి డిసెంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని రైస్‌మిలర్స్ అసోసియేషన్ నాయకులు ,పారిశ్రామికవేత్త కాటంరెడ్డి బాలశంకర్‌రెడ్డి దంపతులను బిజెపి సీనియర్ నాయకులు, మిలర్స్ అసోసియేషన్ నాయకులు ఇనుగూరు బాలయ్య,పొట్టి సుబ్బారావు శాలువాలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతు బాలశంకర్‌రెడ్డితో తమకు ఎంతో అనుబంధం ఉందని ప్రస్తుతం ఆయన పారిశ్రామికంగా బెంగుళూరులో ఉన్నప్పటికి బుచ్చిరెడ్డిపాళెం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. 1970 ప్రాంతంలోనే ఆయన బాయిల్ రైస్ మిల్లు పెట్టి అనేక మందికి ఉపాధి కల్పించారని అన్నారు.అనంతరం సన్మాన గ్రహిత బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం ప్రాంత ప్రజలతో తనకు ఎంతో అనుబంధం ఉందని అన్నారు.బాలయ్య చిరకాల మిత్రుడని పేర్కున్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట రైస్‌మిల్లర్స్ ఉన్నారు.

## వైభవంగా రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట



**బిట్రగుంట, డిసెంబరు 14 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని దళితవాడలో బుధవారం శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం జీర్ణోద్దరణ అనంతరం శ్రీ రామచంద్రుడు, సీత, లక్ష్మణుడు విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ ఆలయ జీర్ణోద్దరణ పనులకు రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షులు పసుపులేటి సుధాకర్‌రావు దంపతులు దాతగా వ్యవహరించారు. ఆలయంలో ధ్వజస్తంభాన్ని స్వర్గీయ మిట్టా రాంబాబు కుటుంబ సభ్యుల దాతృత్వంతో ఏర్పాటు చేశారు. వైఖానస సంప్రదాయ ప్రకారం ఈ నెల 12వ తేది నుండి రామాలయ పునఃప్రతిష్ట ఉత్సవాలు నిర్వహించారు. ఉదయగిరి అనంతనారాయణ చార్యులు పర్యవేక్షణలో వేదపండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.అనంతరం స్వామి వారి కళ్యాణం, అన్నదానం జరిగాయి. పలువురు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గడపగడపకు మన ప్రభుత్వం అద్భుత కార్యక్రమం



**కోవూరు,డిసెంబరు 14 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేదస్సు నుంచి వచ్చిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఒక అద్భుతమని, దీని వలన ఎమ్మెల్యేలకు ఎంతో ఉపయోగకరమని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ, నేతాజీ నగర్ ప్రాంతంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం వలన గ్రామాల్లో ప్రతి ఇంటికి ఎన్ని లక్షల మేర ప్రభుత్వ పథకాలు అందాయో తెలుసుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిన దాఖలాలు లేవన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా టీడీపీ అనుకూల మీడియా ఎన్ని ప్రచారాలు చేసినా ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అని ఇప్పటికే ప్రజలు తీర్మినించారన్నారు. పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. చిన్న గ్రామాల్లో సైతం ఈ మూడేళ్లలో కోట్లాది రూపాయల మేర నిధులు వచ్చియన్నారు. అదేవిధంగా రానున్న జనవరి నెల నుంచి పింఛన్ల పెంపుదలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం 2,500 రూపాయలు ఇస్తున్నారని, దానిని 2750కి పెంచుతూ ముఖ్యమంత్రి చెప్పారన్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలు నిరుపమానమని, రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తమ ఉనికి కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప ్పటికే తెలుగుదేశం ప్రభుత్వం కనుమరుగైందని, రానున్న ఎన్నికల్లో ఆ ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసపింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ జి. భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, తహసీల్దార్ ఎం. పద్మజ, ఎంపీడీవో శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, గృహనిర్మాణ శాఖ డీఈ జగదీశ్వరి, వివిధ శాఖల ఏఈలు పరమేశ్వరలింగం, భాస్కర్‌రెడ్డి, జగదీష్, రమేష్, నేతలు రమణయ్య, పరంధామయ్య, కె. మల్లికార్జున, చిరంజీవి, కె. ప్రసాద్,అంజన్‌రావు, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, , తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**కోవూరు,డిసెంబరు 14 ప్రభాతవార్త** : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్ ప్రాంతంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 14.90 లక్షల మేర చెక్కులను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామానికి చెందిన గంగపట్నం శ్రీనివాసులుకు 10 లక్షలు, బుచ్చి మండలం వవ్వేరు గ్రామానికి చెందిన వీఎం అభిజ్ఞకు 4 లక్షలు, ఇందుకూరుపేట మండలం పోతురాజుదిబ్బకు చెందిన ఎన్. కిచిత్‌కు 90 వేలు మేర చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల కోసం ముఖ్యమంత్రి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసపింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ జి. భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్,తదితరులు ఉన్నారు.

## నవ వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



**సైదాపురం, డిసెంబరు 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలూరురాజుపాళెం గ్రామానికి చెందిన వెంకటగిరి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు కొండూరు యోగిరాజు మరదలైన మాధవి - సతీష్‌లను గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి బుధవారం ఆశీర్వదించారు. ఇటీవలే వీరికి వివాహం జరగడంతో వారి స్వగ్రామమైన పాలూరు రాజుపాళెం గ్రామానికి వచ్చి నవ దంపతులను ఆశీర్వదించారు. వారి వెంట సుధారాజు, వెంకటసుబ్బమ్మ, ఎంపీటీసీ ఈశ్వర్‌రాజు తదితరులు ఉన్నారు.

## వన్‌స్టాప్ సెంటర్ల గురించి ప్రశ్నించిన రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి



**కార్పోరేషన్ డిసెంబర్ 14 ప్రభాతవార్త** పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వన్‌స్టాప్ సెంటర్ల గురించి ప్రశ్నించారు.760 వన్‌స్టాప్ సెంటర్లు ఆమోదించిందా అని ఆయన ప్రశ్నించారు.వన్‌స్టాప్ సెంటర్లు విజయవంతంగానిర్వహించబడుతున్న సెంటర్లు విజయవంతంగా నిర్వహించబడుతున్న సందర్భంలో మహిళలకు సమీకృతిమద్దతు మరి యు సహకారం అందించుటకు 3 వందల వన్‌స్టాప్ సెంటర్లను ప్రారంభిం చుటకు మంత్రిత్వశాఖ ప్రణాళిక చేసినదా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 14 వన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో పరిపాలనా సౌలభ్యం మెరుగైన పాలన కోసం జిల్లాల సంఖ్య 13 నుండి 26 కు పెంచిన విషయం మంత్రిత్వశాఖ దృష్టిలో ఉన్నదా ,అలా అయితే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకోసం మరో 12 వన్‌స్టాప్ సెంటర్లు మంజూరు చేయు విషయంలో మంత్రిత్వశాఖ పరిగణనలో ఉన్నదా అని ప్రశ్నించారు. అలా మంజూరు చేసు_న్నట్లు అయితే వాటి వివరాలు లేనిచో అందుకు గల కారణాలు తెలుపగలరని కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖామంత్రిని ప్రశ్నిం చారు.అందుకు స్పందించిన కేంద్ర మహిళా,శిశు అభివృద్ధి శాఖా మంత్రి స్మృతి ఇరానీ జవాబు ఇస్తు వన్‌స్టాప్ సెంటర్లు స్థాపన వలన మంచి ఫలితాలు వచ్చినందున ఏ జిల్లాలో అయితే మహిళలకు వ్యతిరేఖంగా చేస్తున్న నేరాల రేటు ఎక్కువగా ఉందో మరియు బౌగోళికంగా పెద్దవైన జిల్లాలో మిషన్ శక్తి పథకం కింద మహిళల సంక్షేమం కోసం దశలవారీగా 3 వందల వన్‌స్టాప్ సెంటర్లు ప్రారంభించడానికి ప్రభుత్వం నిర్ణయించం దని, ఆంధ్రప్రదేశ్‌లో పూర్వపు 13 జిల్లాలో 14 వన్‌స్టాప్ సెంటర్లు మంజూరు చేయబడినవని తెలుపుతూ స్కీమ్ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రోగ్రామ్ అప్రూవల్‌బోర్డు వారు రాష్ట్ర ప్రభుత్వాలు మురియు కేంద్ర పాలిత ప్రాంతాలు (ఆంధ్రప్రదేశ్‌తో సహా) కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో వన్‌స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి పంపిన ప్రతిపాదనలు పరిగణలోనికి తీసుకొని ఆమోదించబడినవి అని తెలిపారు.

## ఖోఖో పోటీలలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** విక్రమ సింహపురి యూనివర్శిటీ ఆధ్వర్యంలో నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో జరిగిన అంతర్ డిగ్రీ కళాశాలల ఖోఖో పోటీలలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినిలు రన్నరప్‌గా నిలిచారు.ఈ సందర్భంగా బుధవారం కళాశాల యాజమాన్యం విద్యార్థినుల్ని ప్రత్యేకంగా అబినందించింది. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్, డైరెక్టర్ జానకిరాం, ప్రిన్సిపాల్ పి.వి.రావులు మాట్లాడారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. యూనివర్శిటీ స్థాయిలో వివిధ పోటీలలో తమ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి ఎన్నో బహుమతుల్ని దక్కించుకున్నారన్నారు. ఈ నెలలో జరిగే అంతర్ యూనివర్శిటీ స్థాయి ఖోఖో పోటీలలో మంజూష, కార్తీకాలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికాంత్, ఫిజికల్ డైరెక్టర్ కె.తిరుపాలు. బోదనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కావలి వనితా లెజండ్స్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణ వాసవీ వనితా లెజండ్స్ క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు లభించింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాకరంగా శంషాబాద్ వద్ద వున్న క్లాసిక్ కన్వెషన్ హాలులో ఇంటర్నేనల్ కాన్ఫెరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి వాసవీ వనితా లెజండ్స్ క్లబ్ అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షి, కార్యదర్శి ఇన్నమూరి హేమలతల నాయకత్వంలో కొత్త క్లబ్ అయినప్పటికీ సేవా కార్యక్రమాలలో ప్రత్యేకతను చాటిచెప్పడం వల్ల ఈ అవార్డు లభించిందని డిస్ట్రిక్ట్ గవర్నర్ బండారు శబరీష్ గుప్తా తెలిపారు. బెస్ట్ క్లబ్ అవార్డును ఆయన చేతుల మీదుగా అందజేశారు. మహిళలను అభినందిం చారు.కావలి కమిటీ సభ్యులు బొగ్గవరపు సావిత్రి, దుగ్గిశెట్టి నీలమలు పాల్గొన్నారు. బుధవారం పట్టణంలోని పలువురు ప్రముఖులు అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షికి అభినందనలు తెలిపారు.

## అల్లూరు మండలంలో దెబ్బతిన్న వరినాట్లను పరిశీలించిన ఎడిఎ కన్నయ్య



**అల్లూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త** మాండౌస్ తుఫాన్ ధాటికి అల్లూరు మండలంలోని పురిణి పంచాయతీలో బుధవారం దెబ్బతిన్న వరినాట్లను ఎడిఎ కన్నయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న వరినాట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించి పూర్తి నివేదికను పై అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరు మండల వ్యవసాయాధికారి పి.వేణుగోపాలరావు, సర్పంచ్ మైనంపాటి స్వాతి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## జనంమెచ్చిన పాలన జగనన్నకే సాధ్యం



**మర్రిపాడు,డిసెంబర్14ప్రభాతవార్త:**మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం 3వరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు కాలనీల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటించారు. అనంతరం ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తమ గృహాలను నిర్మించుకునే అనేక సంవత్సరాలు గడిచిందని, వర్షాలు వస్తే ఇబ్బందిగా ఉందని తెలపడంతో వెంటనే గృహనిర్మాణశాఖ అధికారులతో మాట్లాడి అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. అదేవిధంగా బిసికాలనీపర్యటించి పలు సమస్యలను వివరించడంతో వెంటనే అధికారులను సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నా మన్నారు. ముఖ్యమంత్రి తాను ఇచ్చిన హామీ మేరకు ఈసంవత్సరం సామాజిక పెన్షన్ నగదును 2750రూపాయలకు పెంచడంతో పించనుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడి సారధ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే జగనన్న క్రీడా సంబరాలు



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే జగనన్న క్రీడా సంబరాల్ని రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 64వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కావలి తుమ్మలపెంట రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆర్‌ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో బుధవారం జగనన్న దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి క్రీడల్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు పోసిన వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.

దివ్యాంగులలో నూతనోత్తేజాన్ని నింపేందుకు వారిలో వున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే జగనన్న దివ్యాంగుల క్రీడా సంబరాలు ప్రతిష్టాకరంగా నిర్వహించడం జరిగిందన్నారు. ము ఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సంబరాలు నిర్వహించి మొదటి బహుమతి 50 లక్షలు ప్రకటించడం జరిగిందన్నారు. క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. ఈ నెల 18వ తేది జగనన్న క్రికెట్ సంబరాలు కూడా నిర్వహించడం ఎంతైనా అభినందనీయమన్నారు. దివ్యాంగులకు జగనన్న ప్రభుత్వం ఎల్లవేళలా అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు మోటార్‌సైకిళ్లు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్ పంపిణీ చేశారు. పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ అధికారి నాగరాజాకుమారి, ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు,జెడ్పీటీసీ సభ్యులు జంపాని రా ఘవులు, శ్రీశైలం దేవస్థానం కమిటీ డైరెక్టర్ కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, వైసిపి నేతలు జనిగర్ల మహేంద్ర యా దవ్,పందిటి కామరాజు,గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు,సన్నిబోయిన ప్రసా ద్‌యా దవ్, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, పిఇటి చిరంజీవి,పారాకమిటీ చైర్మన్ టి.సి.మా లాద్రి నా యుడు, దివ్యాంగుల పట్టణ అధ్యక్షులు పల్లిబోయిన శ్రీనివాసులు, దివ్యాంగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంగళరావునగర్ మున్సిపల్ పాఠశాలలో భోజనం తనిఖీ చేసిన అధికారులు



**కావలి, డిసెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు ము న్సిపల్ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజ నాన్ని అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మె నూతో పాటు నాణ్యతా ప్రమాణాలను కూడా పరిశీ లించారు.ఈ తనిఖీలలో కావలి డిప్యూటీ డిఇవో యం. హరిప్రసాద్,ఎంఇవో కె.శ్రీధర్,పాఠశాల పేరెం ట్స్ కమిటీ చైర్మన్ గోళ్ల అమరజ్యోతి, వైస్ చైర్మన్ సయ్యద్ ఘనీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**చేజర్ల,డిసెంబర్14ప్రభాతవార్త:** మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మినుము, పచ్చిశనగ పంటలను పొదలకూరు వ్యవసాయ పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త నాగమణి బుధవారం పరిశీలిం చారు.చిత్తలూరు, చేజర్లకండ్రిక గ్రామాల్లోని మినుము , శనగ పంటలను పరిశీలించారు. వర్షం ఆగిన తర్వాత పురుగులు, తెగుళ్ళు పంటను ఆశించే అవకాశం ఉందని , పచ్చిశనగపంటను స్పోడోసైరా లద్దెపురుగు ఆశించి ఉందన్నారు. దీన్ని నివారించేందుకు యమామిట్టిన్, బెంజోయేట్ 100గ్రామాలను ఒక ఎకరాకి పిచికారీ చేయాలన్నారు. మినుము పంటకు బూస్టర్‌డోస్‌గా మల్టీకె 5గ్రాముల మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పంట ఎదుగుదల ఉంటుందన్నారు. తుఫాన్‌కు దెబ్బతిన్న వరినారు మడులకు 80శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తామన్నారు. రైతులందరూ ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.శశిధర్, విఎఎ కిరణ్‌కుమార్ , రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కుళాయి, డ్రైను తదితర రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ హరిత ఆదేశించారు. స్థాని 24/1 కనుపర్తిపాడు సచివాలయాన్ని కమిషనర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి, సచివాలయం పరిధిలోని గృహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణ బిన్స్ పంపిణీ చేశారా అని విచారించారు. కమర్షియల్ ఆస్తి పన్నులతో పాటు ఇంటింటి చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు. మంచినీటి కొళాయిల నూతన కనెక్షన్ల మంజూరుకు ప్రజల్లో అవగాహన పెంచాలని, అనుమతులు లేని కనెక్షన్లపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శులంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ప్రతి రోజూ తప్పక ధరించాలని కమిషనర్ సూచించారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు నగరంలో... నెల్లూరు క్రైమ్, సంతపేట, దర్గామిట్ట,బారకాసు, కొండాపురం మండలంకు విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031